సాక్షి పెద్దపల్లి

శనివారం ¦ 4 ¦ ఫిబ్రవరి ¦ 2023



రాజన్నకు భక్తుల తాకిడి

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడిబట్టలతో రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.



రైల్వే కేటాయింపులు భేష్!

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కరీంనగర్ రైల్వేకు పెద్దపీట వేశారు. ఏకంగా రూ.647 కోట్లను కేంద్రం కేటాయించింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పండిత టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని సంఘం నాయకులు శుక్రవారం డీఈవో మాధవికి వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని మూడు రోజులుగా 9,10 తరగతులు బహిష్కరిస్తున్నట్లు పండిత జేఏసీ నాయకులు జీగురు రవీందర్, సట్టు కనుకయ్య, రవీందర్, శంకర్, సమియుల్లా, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, హఫీజ్ తెలిపారు. పాతికేళ్లుగా ఎస్జీటీ స్కేల్‌పై స్కూల్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కనీసం ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోలేని దుస్థితిలో ఉన్నామని అన్నారు. సీఎం కేసీఆర్ తన హామీని అమలు చేయాలన్నారు.

గొర్రెల పంపిణీకి నగదు బదిలీ చేయండి



వినతిపత్రం ఇస్తున్న తిరుపతి యాదవ్

సుల్తానాబాద్: గొర్రెల పంపిణీ కార్యక్రమానికి బదులు నగదు బదిలీ చేయాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావును గొల్ల,కుర్మల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ కలిసి వినతిపత్రం అందించారు. బడ్జెట్‌లో గొల్ల, కురుమలకు నిధులు కేటాయించాలని కోరారు. గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ రూపంలో పథకాన్ని అందించాలని, గతంలో ఎన్సీడీసీలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని, తన ఖాపడ్డ ఆస్తులను విడిపించాలని కోరారు. రాష్ట్రంలో రెండు మండలాలకు ఒకటి చొప్పున గొర్రెల, మేకల మార్కెట్లు ఏర్పాటు చేస్తూ, ఒక్కోమార్కెట్‌కు రూ.5 కోట్ల నిధులను కేటాయించాలని అన్నారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కాల్వ మల్లేశంయాదవ్, దేశబోయిన సూర్యనారాయణ యాదవ్, శిలారపు పర్వతాలుయాదవ్, తదితరులు ఉన్నారు.

ఉన్నతిలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీధర్

ధర్మారం: ఉన్నతిలో శిక్షణ పూర్తిచేసినవారు ఉద్యోగావకాశాలు పొందవచ్చని డీఆర్‌డీవో శ్రీధర్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో 2018–19 సంవత్సరంలో వందరోజుల పని దినాలు పూర్తిచేసుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు మండలంలోని కొత్తూరు, ఖిలావనపర్తి, బంజేరుపల్లి తండాబి గ్రామాల్లో శుక్రవారం కూలీలతో ఉన్నతి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీధర్ మాట్లాడుతూ వంద రోజులు పని పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం తిరిగి పని కల్పించాలనే లక్ష్యంతో ఉన్నతి ఆధ్వర్యంలో వివిధ వృత్తులపై శిక్షణ ఇస్తోందని అన్నారు. ఈ శిక్షణ సమయంలో ప్రతి ఒక్కరికి రోజుకు రూ.250 చెల్లిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారు శిక్షణ తరగతులకు హాజరుకావాలని కోరారు. ఏపీవో రవీందర్, ఏపీడీ సత్యనారాయణ, ఎంపీవో రమేశ్ ఉన్నారు.

పెద్దపల్లి నుంచే బీసీ రిజర్వేషన్ల పోరాటం



రిలేదీక్షా శిబిరం వద్ద నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీగణన, రిజర్వేషన్ల పెంపు కోసం బహుజనులంతా ఏకం అయ్యేందుకు పెద్దపల్లి నుంచే పోరాటం మొదలైందని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో తొమ్మిది రోజులుగా సాగుతున్న రిలేదీక్ష శిబిరాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉషతో కలిసి శుక్రవారం సందర్శించారు. జనాభాలో 52శాతం ఉన్న బీసీలు పాలకులుగా ఎదగడం లేదన్నారు. అగ్రవర్ణాల పాలనలో మరింత అణగదొక్కబడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని దర్గాలో శుక్రవారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు శేషాద్రి, రియాజ్, రవికుమార్, అరుణ, సాధిక్, సురేశ్, అరుణ్; అజయ్, రవి ఉన్నారు.

ఆహ్లాదం... అధ్వానం!

నిర్వహణ లేని 'రామగుండం' పార్కులు

- రూ.లక్షలు వెచ్చించి గేట్లకు తాళం..
- ఏడాదిగా తెరుచుకోని వైనం
- పార్కుల్లో ఎండిపోయిన మొక్కలు, ఖాళీ మద్యం సీసాలు
- పాలకుల నిర్లక్ష్యానికి ఆనవాళ్లు కోల్పోతున్న వైనం
- ఎట్టకేలకు టెండర్లు తెరిచిన బల్దియా అధికారులు



ఎండిపోయిన పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న ఈ పార్కు రామగుండం నగరపాలక పరిధిలోని దుర్గానగర్ కాలనీలోనిది. ఏడాది క్రితం వరకు పచ్చని మొక్కలతో కళకళలాడింది. రూ.50 లక్షల అమృత్ నిధులను వెచ్చించి 2017మార్చిలో వినియోగంలోకి తెచ్చారు. రూ.20 లక్షల పట్టణ ప్రగతి నిధులు వెచ్చించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కానీ ఏడాది నుంచి పార్కు నిర్వహణను వదిలేశారు. పచ్చని మొక్కలు ఎండిపోయాయి. వాకింగ్ ట్రాక్ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. క్రీడా సామగ్రి మూలకు పడ్డాయి. తాగిపడేసిన మద్యం బాటిళ్లు, సిగరెట్లు దర్శనమిస్తున్నాయి. ఇదే తరహాలోనే గౌతమినగర్‌లోని పార్కు, ఇందిరమ్మకాలనీ, టీచర్స్‌కాలనీ, గంగానగర్, విఠల్‌నగర్‌లోని పార్కులు అధ్వానంగా మారాయి.



నిరుపయోగంగా గౌతమినగర్ పార్కు

కోల్‌సిటీ(రామగుండం): నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేవి, తీరిక దొరకని దైనందిన జీవితంలో కాస్త సేదదీరేందుకు ఉపయోగపడేవి పార్కులు. పచ్చని మొక్కలు, చెట్లు, ఆటవస్తువులు, వ్యాయామ పరికరాలతో, అందంగా, సౌకర్యంగా తీర్చిదిద్దితేనే పార్కులు జనానికి ఆహ్లాదాన్ని పంచుతాయి.. ఆరోగ్యాన్ని ఇస్తాయి. కానీ రామగుండం కార్పొరేషన్‌లోని ఉద్యానవనాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సందర్శకులతో కళకళలాడాల్సిన పార్కులు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. ఏడాదిగా పార్కుల గేట్లకు వేసిన తాళాలు తెరుచుకోవడం లేదు.

సకాలంలో టెండర్లు పిలువని అధికారులు

రామగుండం బల్దియాలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆరు పార్కుల నిర్వహణను పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు సకాలంలో టెండర్లు పిలవడం లేదు. గత నెల 23న ఆరుపార్కులకు ఏడాదిపాటు నిర్వహణకు రూ.20 లక్షలతో రెండు ప్యాకేజీలతో టెండర్లు పిలిచారు. శుక్రవారం ఆ టెండర్లను తెరిచారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే పార్కులను తిరిగి వినియోగంలోకి తేవచ్చని నగరవాసులు అంటున్నారు.

రూ.లక్షలు వెచ్చించి..

- రామగుండం నగరపాలక పరిధిలో సుమారు రూ.3కోట్ల నిధులతో పార్కులు ఏర్పాటు చేశారు. వీటిలో చిన్నారులు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్‌లు అందుబాటులో ఉంచారు. అయితే ఏడాదికాలంగా పార్కుల నిర్వహణ గాలికి వదిలేసి, గేట్లకు తాళాలు వేశారు.
- ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఉద్యానవనాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. నిర్వహణ లేకపోవడంతోపాటు పార్కులోని మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారాయి.
- దుర్గానగర్‌లో రూ.50లక్షలు అమృత్ నిధులు వెచ్చించి పార్కు ఏర్పాటు చేశారు. రూ.20లక్షల పట్టణ ప్రగతి నిధులతో ఓపెన్ జిమ్ నిర్మించారు. ఏడాదిగా నిర్వహణ చేపట్టకుండా గేట్లకు తాళాలు వేశారు. ఫలితంగా పార్కులో తాగిపడేసిన మద్యం బాటిళ్లు వెలుగు చూస్తున్నాయి.
- గౌతమినగర్‌లోనూ రూ.50 లక్షల అమృత్ నిధులతో పార్కు, మరో రూ.20 లక్షల పట్టణ ప్రగతి నిధులతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ చేపట్టకుండా పార్కు గేట్లకు తాళాలు వేశారు. పిల్లలు ఆడుకునే సామగ్రి పనికిరాకుండా పోతోంది.
- రూ.కోటి 50 లక్షల నిధులతో ఇందిరమ్మ కాలనీ, టీచర్స్ కాలనీ, గంగానగర్, విఠల్‌నగర్‌లో కూడా పార్కులను నిర్మించారు. ఈ పార్కుల నిర్వహణను కూడా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి.



ఆరు నెలలుగా పార్కు గేట్లకు వేసిన తాళాలు



పార్కులో తాగిపడేసిన మద్యం బాటిళ్లు

నిర్లక్ష్యం వీడాలి



నగరంలోని పార్కుల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి. దుర్గానగర్ కాలనీలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కును, ఏడాదికిపైగా నిర్వహణ చేపట్టడం లేదు. మొక్కలు ఎండిపోయి పార్కు అధ్వానంగా మారింది. కాపలాదారుడు, లైట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

– మంథెన సంపత్, దుర్గానగర్‌కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం



పార్కుల నిర్వహణ కోసం పిచిన టెండర్లను తెరిచాం. కాంట్రాక్టర్లకు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తాం. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడానికే పార్కులను ఏర్పాటు చేశాం. వాటి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

- కలెక్టర్ సంగీత



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ఆయిల్‌పాం పంటసాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి పంటసాగుకు ప్రోత్సహించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం క్లస్టర్, డివిజన్ వారీగా సాగవుతున్న పంటలపై జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ పాం సాగును జిల్లాలో ఈ సంవత్సరంలో 2,600 ఎకరాల్లో చేయాలనే లక్ష్యాన్ని ఎంచుకుని 1,072 ఎకరాల్లో పూర్తి చేశామని అధికారులు వివరించారు. మరో 570 ఎకరాల్లో త్వరలోనే సాగవుతుందన్నారు. ఆయిల్‌పాంను రైతులు అంతరపంటలుగా సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరానికి రైతుబంధుతో పాటు అదనంగా రూ.4200 రాయితీని అందిస్తుందని వివరించారు. ఈ విషయాలను రైతులకు వివరించి ఆయిల్‌పాం సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఉద్యానవన అధికారి జ్యోతి, శ్రీకాంత్, ఏడీఏ, ఏఓ, ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సీపీ రెమా రాజేశ్వరి



టూటౌన్‌ను పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

యైటింక్లయిన్‌కాలనీ: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను సీఐ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతకాలంలో అందివచ్చిన టెక్నాలజీతో అమ్మాయిలకు ఆన్‌లైన్‌లో వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. వాటిపై పోలీస్‌శాఖ అవగాహన కల్పించాలని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రజలకు రక్షణ, భద్రతాభావం, సైన్యాప్ సెక్యూరిటీ కల్పించడం కోసం కృషి చేస్తామని వివరించారు. అనంతరం రామగిరి మండలం సుందిళ్ల లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు కళాధర్‌రెడ్డి, శ్యామ్‌పటేల్, కమాన్‌పూర్ ఎస్సై మస్తాన్ ఉన్నారు.

ఆగని ఇసుక రవాణా..

- మానేరులో తవ్వకాలు ఆపాలని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు
- రాత్రివేళల్లో తవ్వకాలు చేసి.. శివారు ప్రాంతాల్లో డంపింగ్
- ప్రభుత్వ పథకాల పేరుతో అక్రమంగా తరలింపు
- ఆన్‌లైన్ బుకింగ్ ఆపితేనే అడ్డుకట్టకు అవకాశం



ఈ ఇసుక క్వారీ మంథని ముత్తారం పరిధిలోనిది. ఎన్జీటీ ఆదేశాలు ఉన్నప్పటికీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా 13 ఇసుక క్వారీల్లో 654 ఆన్‌లైన్ అర్డర్ల ద్వారా 20,228 టన్నుల ఇసుకను రవాణా చేశారు. నకిలీ బిల్లులు, అదనపు బకెట్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సాక్షి, పెద్దపల్లి: ప్రభుత్వం జిల్లా పరిధిలోని మానేరు వాగులో పలుచోట్ల ఇసుకరీచ్‌లు ఏర్పాటు చేసింది. డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండంతో, పర్యావరణ అనుమతులు లేకుండా మానేరులో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని మానేరు పరిరక్షణసమితి సభ్యులు చెన్నైలోని హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)ను ఆశ్రయించారు. ఇసుక తవ్వకాలు, రవాణాను నిలిపివేయాలని గతనెల 23న ఎన్జీటీ ఆదేశాలు జారీచేసింది. ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాంట్రాక్టర్లు రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి డంపింగ్‌చేస్తూ, అక్కడి నుంచి ప్రభుత్వ పనుల పేరుతో తరలిస్తున్నారు.

రాత్రివేళల్లో తవ్వకాలు

ఎన్జీటీ ఆదేశాలతో మానేరులో ఇసుక తవ్వకాలు, స్టాక్‌యార్డ్‌ల నుంచి ఇసుక రవాణా నిలిపివేసినట్లు టీఎస్ఎండీసీ అధికారులు ప్రకటించారు. స్టాక్‌యార్డ్‌లలో నిల్వ ఉంచిన ఇసుకను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తామని ప్రకటించారు. ఇదే అదునుగా తీసుకుంటున్న కాంట్రాక్టర్లు రాత్రి వేళలో ఇసుక తవ్వకాలు చేపట్టి, స్టాక్‌యార్డ్‌కు తరలించి, పొద్దంతా జిల్లాను దాటించేస్తున్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పేరిట..

జిల్లాలోని మానేరునదిపై ప్రభుత్వం సుమారు 20కి పైగా చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తోంది. వీటిలోపల ఇసుక 6మీటర్ల మేరకు పేరుక పోయిందని 2మీటర్ల లోతు వరకు ఇసుకను తొలగిస్తే చెక్‌డ్యాంలు పటిష్టంగా ఉండటంతో పాటు నీటిని నిల్వచేయవచ్చని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. డీసిల్టేషన్ కింద టీఎస్ఎండీసీ ద్వారా 18ఇసుక రీచ్‌లను గుర్తించి టెండర్లను ఆహ్వానించింది. గుర్తించిన రీచ్‌లనుంచి 1.32కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించేందుకు టెండర్లు కట్టబెట్టారు.తద్వారా ప్రభుత్వానికి రూ.760.05కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

6,286 ఆర్డర్లు... 1,94,669 టన్నుల ఇసుక



ఎన్జీటీ ఆదేశాలు వెలువడిన జనవరి 23నుంచి ఫిబ్రవరి 3వరకు 6,286 ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా 1,94,669 టన్నుల ఇసుక అధికారికంగానే రవాణా చేశారు. అనాధికారికంగా వే బిల్లులు లేకుండా, అదనపు బకెట్లతో రవాణా చేసింది వీటికి అదనం. 2మీటర్ల లోతు మాత్రమే తీయాలని చెప్పినా.. అంతకు డబుల్ లోతులో మానేరు నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో ఎన్జీటీ ఆదేశాలు అమలు చేయాలని మానేరు పరిరక్షణ సమితి సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అక్రమ రవాణా ఆగకపోవడంతో శుక్రవారం హైదరాబాద్‌లో టీఎస్ఎండీసీ వైస్‌చైర్మన్ అండ్ ఎండీలకు వినతిపత్రం సమర్పించి, కోర్టు ఆదేశాలు తక్షణం అమలు చేయాలని కోరారు. ఇదే విషయమై టీఎస్ఎండీసీ పీవోలను వివరణ కోరగా కోర్టు ఉత్తర్వులకు లోబడి తవ్వకాలు నిలిపివేశామని, స్టాక్‌యార్డుల నుంచి ఇసుకను తరలిస్తే తనిఖీలు చేపడతామని అన్నారు.

ఆన్‌లైన్ బుకింగ్స్ నిలిపివేయాలి



ఎన్జీటీ ఆదేశాలు ఇచ్చినా... మానేరు తీరంలో ఇసుక తవ్వకాలు, రవాణా ఆగటం లేదు. ఇసుక తవ్వకాలతో మానేరు తీర ప్రాంతప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని స్థానిక యంత్రాంగానికి ఎన్ని వినతిపత్రాలు ఇచ్చిన అక్రమరవాణా ఆగడం లేదు. ఇప్పటికైనా టీఎస్ఎండీసీ బుకింగ్‌లు ఆపివేయాలి. స్టాక్‌ను సీజ్‌చేసి తుది ఉత్తర్వులు వచ్చేవరకు రవాణా నిలిపివేయాలి.

–అంబటి కరుణాకర్‌రెడ్డి, మానేరు పరిరక్షణ సమితి

ఎక్కడి సమస్యలు అక్కడే..



అమర్‌నగర్‌లో చాయ్ తయారు చేస్తున్న విజయ్

- బస్‌డిపో, బైపాస్, మెడికల్‌కాలేజీ, రింగ్‌రోడ్డు ఏదీ?
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంగా ఆవిర్భవించి ఆరేళ్లు గడిచినా మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయిన పెద్దపల్లి అభివృద్ధికి నోచుకోలేదని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని ప్రధానవీధులగుండా సాగింది. వివిధ మార్గాలను కలిపే రోడ్లు, రైల్వేస్టేషన్ ఉన్న పెద్దపల్లిలో ఇప్పటికి బస్‌డిపో ఏర్పాటు కాలేదన్నారు. రింగ్‌రోడ్డు, బైపాస్‌రోడ్ల జాడే లేక పట్టణంలోని రోడ్లపై రద్దీ పెరిగిందని పేర్కొన్నారు. అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉండి కూడా వీటిని సాధించకపోవడమేంటని ప్రశ్నించారు. మెడికల్‌కాలేజీని పెద్దపల్లిలో ఏర్పాటు చేయించాల్సి ఉందన్నారు. కేవలం తన ఆస్తులున్న ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడం మున్సిపాలిటీని తన వ్యాపారసంస్థగా భావించి ట్రేడ్‌లైసెన్సు ఫీజును అడ్డగోలుగా పెంచాడని ఆరోపించారు. వ్యాపారుల సహకారంతో పోరాడి ఫీజును తగ్గించగలిగామన్నారు. వెంట నా యకులు సురేశ్‌గౌడ్, వేములరామ్మూర్తి, మల్లయ్య, సారయ్య, ప్రకాశ్‌రావు, మహేందర్, ప్రేంసాగర్‌రెడ్డి, నెత్తెట్ల కుమార్, తూముల సుభాశ్‌రావు, సుధాకర్‌రెడ్డి, జగదీశ్, ఈర్ల స్వరూప, భారతి, రాములు, రవి, సతీశ్, రాజు, రఫీక్, శ్రీనివాస్ ఉన్నారు.

విధులను విస్మరించి.. యూట్యూబ్‌లో కాలక్షేపం



సకల సదుపాయాలు... ఇంటర్నెట్ అన్‌లిమిటెడ్ డాటా... ఆఫీస్ కంప్యూటర్ ఇంకేం వాడుకున్నోళ్లకు వాడుకున్నంత. సమయం పనికి తక్కువ, కాలక్షేపానికి ఎక్కువ అన్నట్లు ఉంది మన ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు. కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్న వేళ 'అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ వర్క్స్ అండ్ ప్రాజెక్ట్స్' కార్యాలయ సిబ్బంది ఇలా యూట్యూబ్ చూస్తూ 'సాక్షి' కెమెరాకు కనిపించాడు. కలెక్టరేట్‌లో ప్రతీ విభాగంలో వైఫై సౌకరతో తమ సెల్‌ఫోన్‌లలో, డెస్క్‌టాప్‌ల్లో సిబ్బంది ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని పనుల నిమిత్తం వచ్చిపోయే వారు విమర్శిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

సంస్థ పరిరక్షణకు ఉద్యమించాలి



కార్మికులతో మాట్లాడుతున్న క్రిష్ణ

గోదావరిఖని: ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ నేపథ్యంలో సింగరేణి పరిరక్షణ కోసం యువ కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ అన్నారు. శుక్రవారం జీడీకే–11గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మిక హక్కులపై జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడులను వ్యతిరేకించాలన్నారు. యాజమాన్యానికి తొత్తుగా మారుతున్న కార్మిక సంఘాలను తరిమికొట్టాలని సూచించారు.. కార్మిక హక్కుల సాధన కోసం విప్లవ కార్మిక సంఘాలను కార్మికులు ఆదరించాలన్నారు. సమావేశంలో నాయకులు నరేశ్, కొండ్ర మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించిన సీపీ



వ్యూపాయింట్ నుంచి పరిశీలిస్తున్న సీపీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఇటీవట బాధ్యతలు చేపట్టిన రెమా రాజేశ్వరి శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు క్వారీ వ్యూయింట్ వద్ద నుంచి బొగ్గు ఉత్పత్తి, భారీ యంత్రాల పనితీరు పరిశీలించారు. పర్యావరణ సమతుల్యత కోసం చెట్ల పెంపకం తదితర వివరాలను ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీపీ వెంట గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై శ్యాంపటేల్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, సంక్షేమాధికారి సురేందర్ తదితరులన్నారు.

పత్తి క్వింటాల్‌కు ధర రూ.7721

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం పత్తి క్వింటాలుకు ధర రూ. 7721 పలికింది. కనిష్ట ధర రూ. 6951 గా, సగటు ధర రూ.7611 గా నమోదైందని ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

కారును ఢీకొన్న లారీ



నుజ్జునుజ్జయిన కారు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ రాజీవ్ రహదారిలో శుక్రవారం కారును లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సు, లారీ, మారుతీ కారు ఒకదాని వెనుక ఒకటి పెద్దపల్లి వైపు వెళ్తున్నాయి. ఈక్రమంలో దుర్శేడ్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సును ఆపడంతో వెనుక నుంచి మారుతీ కారులో వస్తున్న ఇల్లంతకుంట మండలం రేపాకకు చెందిన అన్నాడి బాల్‌రెడ్డి, అనిత దంపతులు బస్సు పక్క నుంచి వెళ్లారు. వెనుక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ ఒక్కసారిగా కారును బలంగా ఢీకొట్టి ముందుకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని బ్లూకోల్ట్స్ పోలీసులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపై ప్రమాదానికి గురైన కారు, లారీలను తొలగించారు. రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు ప్రమాద సంఘటన వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

ఆ పిల్లలు సేఫ్

- అపరిచితురాలే అపహరించింది!
- పిల్లల కిడ్నాప్ వ్యవహారంలో కొత్తమలుపు
- సీడబ్ల్యూసీ ఎదుట పదేపదే స్టేట్‌మెంట్లు మార్చిన నిందితురాలు
- డబ్బులు అడుగుతున్నారని ఎదురుతిరిగిన నిందితురాలు
- బాధితుల తరఫున మహారాష్ట్ర అధికారులతో మాట్లాడిన 'సాక్షి'
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు



తండ్రుల చెంత చిన్నారులు, కిడ్నాప్ చేసిన నిందితురాలు జయశ్రీ(వృత్తంలో)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో కిడ్నాపైన చిన్నారుల కథ సుఖాంతమైంది. రైల్వే పోలీసుల అప్రమత్తత, మహారాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ల చొరవతో ఎట్టకేలకు చిన్నారులు తండ్రుల ఒడి చేరారు. ఈ క్రమంలో చిన్నారులను అపహరించిన నిందితురాలు బాధితులపై పలు ఆరోపణలు చేసి వారిని అక్కడ ఇక్కట్లపాలు చేసే యత్నం చేయడం గమనార్హం. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఉదంతం ఆద్యంతం అనేక మలుపులు తిరిగింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బోర్డ్ మెంబర్ రామ్ జాఫ్తర్ కథనం ప్రకారం.. ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం మంకమ్మతోటకు చెందిన మిడిదొడ్డి లోకేశ్ (9), మాదాసి అక్షిత (11)లను పొరుగున ఉండే జయ శ్రీ చాక్లెట్లు కొనిస్తానని తీసుకెళ్లింది. కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలెక్కి ఔరంగాబాద్‌కు బయల్దేరింది. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో ఔరంగాబాద్ సమీపంలోని జాల్నా రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై దిగిన చిన్నారులను జయశ్రీ కొట్టింది. అంతటితో ఆగకుండా వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ పగలగొట్టింది. వెంటనే స్పందించిన రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు పిల్లలను విచారించి ఆమె నుంచి కాపాడి మహా రాష్ట్ర చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులకు అప్పగించారు. షాక్‌లో ఉన్న పిల్లలకు తొలుత కౌన్సెలింగ్ ఇచ్చి.. చిల్డ్రన్స్‌హోంకు పంపారు.

అర్ధరాత్రి బయల్దేరిన తండ్రులు..

గురువారం రాత్రి విషయం తెలుసుకున్న పిల్లల తండ్రులు మిడిదొడ్డి ప్రవీణ్, మాదాసి సురేశ్‌లు జయశ్రీ భర్త సత్యనారాయణ, ఆమె కుమారుడు శివకుమార్‌తో కలిసి మహారాష్ట్రకు కారులో బయల్దేరి వెళ్లారు. ఉదయం పిల్లల గుర్తింపు ప్రక్రియ పూర్తవగానే.. తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి వెళ్లే సమయంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు కారులో రావొద్దని జయశ్రీ వాదనకు దిగింది. దీంతో వారు తాము కూలీ పనిచేసుకునే వారిమి అని, తిరిగి వెళ్లేందుకు బస్సు ఖర్చులు ఇవ్వాలని అడిగారు. దీంతో తనను బాధితులు డబ్బులు అడుగుతున్నారని మధ్యాహ్నం సీడబ్ల్యూసీ అధికారుల ముందు జయశ్రీ ఆరోపించింది. జయశ్రీ స్వస్థలం ఔరంగాబాద్. ఆమెది మరాఠీ మాతృభాష. బాధితులు ఉన్నత విద్యావంతులు కాదు. ఇద్దరూ కూలీలే. హిందీ కూడా రాదు. కంగారుపడిన బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. దీంతో విషయాన్ని అక్కడి అధికారులకు సాక్షి మొత్తం వివరించింది. అసలు విషయం తెలుసుకున్న అధికారులు వారికి నచ్చజెప్పి వారిని అందరినీ ఒకే కారులో తిరిగి వెళ్లాలని ఒప్పించారు. కార్పొరేటర్ దిండిగాల మహేశ్ కూడా చొరవ తీసుకున్నారు. బాధితులు, నిందితులతో మాట్లాడి వాగ్వాదాలు లేకుండా ఇంటికి రావాలని వారిక ఫోన్‌లో నచ్చజెప్పారు.

ఆంటీ మమ్మల్ని బాగా కొట్టింది..!

కిడ్నాప్‌కు గురైన అక్షిత, లోకేశ్‌లు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. తమను కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించిందని, ఎక్కడికి తీసుకెళ్తున్నావని ప్రశ్నించిన ప్రతీసారీ.. మార్గమధ్యలో చాలా కొట్టిందని వాపోయారు. జాల్నాలో రైలు ఆగగానే తాము దిగి ఆమెతో వాగ్వాదానికి దిగామన్నారు. దీంతో ఆమె కోపంతో తమ ఫోన్ పగలగొట్టిందని.. ఇంతలో ఆర్పీఎఫ్ బలగాలు వచ్చి తమను కాపాడారని వివరించారు. అనంతరం మహారాష్ట్ర అధికారులు జయశ్రీ తన వాంగ్మూలాలు పదేపదే మారుస్తుండటంతో తలలు పట్టుకున్నారు. విచారణ సమయంలో.. పిల్లలను తాను దేవుడు వద్దకు తీసుకెళ్తున్నానని ఒకసారి, తమ పనిమనిషి పిల్లలని మరోసారి ఇలా రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చింది. దీంతో ఆమె మానసిక స్థితిపై వారికి సందేహాలు కలిగాయి. అదే అనుమానంతో అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో అసలు కథ వెలుగుచూసింది. జయశ్రీ కుటుంబ సభ్యులు ముందు నుంచి ఆమెను కాపాడే యత్నం చేస్తున్నారు. బాధితులు జయశ్రీపై ఎక్కడ కిడ్నాప్ కేసు పెడతారో అని వారిని పోలీసుస్టేషన్ వెళ్లకుండా.. తమ కారులో మహారాష్ట్ర తీసుకెళ్లారు. తీరా అక్కడికెళ్లాక వారిని బెదిరింపులకు గురిచేశారు. మహారాష్ట్ర అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అయితే.. బాధితులు సదరు నిందితురాలిపై కిడ్నాప్ కేసు పెడతామని నిర్ణయించుకున్నారు. దీంతో ఆమెను తెలంగాణకు తీసుకురాకుండా ఆమె స్వస్థలం ఔరంగాబాద్‌కు తరలించే యత్నం చేస్తున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు అయ్యదేవర గణేశ్ శర్మ, అన్నయ్య శర్మ, వల్లూరి సతీశ్‌శర్మ, మహేశ్ శర్మల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం వేద పారాయణం, గోపూజ, గణపతిపూజ, స్వస్తిణ్యాహవాచనం, మాతృకపూజ, నార్దీసమారాధన, పంచగవ్య ప్రాశనం, ఋత్వగ్వరణం, దీక్షాధారణ, అగ్ని మధనం, యాగశాల ప్రవేశం, శోభాయాత్ర, యోగిని, వాస్తు క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల స్థాపనాధికం, అగ్నితంత్రం, సాయంత్రం జలాధివాసం, నీరాజన మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ సుముకం మల్లారెడ్డి, ఉప సర్పంచ్ సుకేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ, రెడ్డి సంఘం, మహిళలు, పాల్గొన్నారు.

కుదిరిన వేతన సవరణ ఒప్పందం



పెరిగిన వేతన ఉత్తర్వులు అందజేస్తున్న కౌశిక హరి

రామగుండం: పక్షం రోజులుగా ఆందోళన చేస్తున్న బూడిద లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతన సవరణ ఒప్పందం కుదిరిందని కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి తెలిపారు. శుక్రవారం లారీ డ్రైవర్లు, ఓనర్లతో టిప్పర్ యజమానులు ఇరుపక్షాలు జరిపిన చర్చల్లో ఈ ఒప్పందం జరిగిందని అన్నారు. 24 గంటల డ్రైవర్ డ్యూటీకి రూ.1,450, క్లీనర్‌కు రూ.800, ఏడాదికి డ్రైవర్‌కు ఫుల్ బోనస్ (120 మస్టర్లు), ఏడాదికి రెండు జతల షూస్, రెండు జతల దుస్తులు, అకస్మాత్తుగా డ్రైవర్, క్లీనర్‌ను విధుల నుంచి తొలగించాల్సి వస్తే ఒక నెల వేతనం చెల్లింపు, డ్రైవర్ అకస్మాత్తుగా మానేయకుండా ఒక నెల ముందే ఓనకు సమాచారం ఇవ్వాలి, క్లీనర్ లేకుండా డ్రైవర్ వాహనం నడిపితే క్లీనర్ జీతంలో సగం డ్రైవర్‌కు చెల్లింపు, విధి నిర్వహణలో డ్రైవర్, క్లీనర్ గాయపడితే పూర్తి బాధ్యత ఓనర్‌దే, వర్షాకాలంలో నాలుగు నెలలు నడవని పరిస్థితుల్లో ప్రతినెలా సగం వేతనం చెల్లింపు, పదవ తేదీలోగా వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ఒప్పందం రెండేళ్లకు మాత్రమే పరిమితమని తెలిపారు. కాగా డ్రైవర్లు, క్లీనర్లకు మెరుగైన వేతన సవరణ చేసిన కౌశిక హరికి కృతజ్ఞతలు తెలిపారు.

కళాతపస్వీ విశ్వనాథ్ మృతికి సంతాపం



విశ్వనాథ్‌ను కొనియాడుతున్న ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): భారత సినిమా గర్వించదగ్గ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి గోదావరిఖనిలోని ప్రజానాట్య మండలి, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, గోదావరి కళా సంఘాల సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విశ్వనాథ్‌కు నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కె.స్వామి, కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మేజిక్ రాజా, దామెర శంకర్, కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య మాట్లాడారు. సంగీత, సాహిత్యాలు ప్రధాన ఇతివృత్తంగా, మానవ సంబంధాలను అత్యంత సృజనాత్మకంగా, సున్నితంగా దృశ్యీకరించిన గొప్ప భారతీయ దర్శకుడు విశ్వనాథ్ అని కొనియాడారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమాలలో ప్రజానాట్యమండలి బాధ్యులు కన్నం లక్ష్మీనారాయణ, కె.కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య, మద్దెల దినేశ్, సిరిసిల్ల మల్లేశ్, కొండ్ర రాజయ్య, రమేశ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కోలేటి' దిగ్భ్రాంతి

గోదావరిఖని: కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలుగు సినిమా రంగానికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌ను కలిసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శిగా మిట్టల్‌ను కొనసాగించాలి



ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న అధ్యాపకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఇంటర్‌బోర్డు కార్యదర్శిగా నవీన్ మిట్టల్‌ను కొనసాగించాలని కోరుతూ శుక్రవారం సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు భోజన విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్, జిల్లా అధ్యక్షుడు కె.సునీల్ మాట్లాడుతూ నవీన్ మిట్టల్ ఇంటర్ విద్యా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ కాలంలోనే ఇంటర్ విద్యలో అవినీతిపరులు, అక్రమార్కుల భరతం పట్టారని అన్నారు. పారదర్శకంగా ఇంటర్ విద్య, పలు సంస్కరణలు చేపట్టి ఈ–ఆఫీస్, బయోమెట్రిక్, విధానాన్ని అవలంబించారని కొనియాడారు. రాబోయే ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు మిట్టల్‌ను కొనసాగించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, అర్జున్, రాజేందర్, రాజశేఖర్, అరుణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

పెద్దపల్లిరూరల్: జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులను శుక్రవారం జిల్లా విద్యాధికారి మాధవి అభినందించారు. రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించి ఈనెల 7నుంచి 12వరకు పాట్నాలోని పాటలీపుత్ర స్టేడియంలో జరిగే అండర్–14, అండర్–16 పోటీలకు ఎంపికైన శావ్యశ్రీ (కొలనూరు), మనోజ్ఞ, అభినవ్, అవినాష్‌రెడ్డి, (ధర్మారం)లను శాలువాలతో సత్కరించారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు రాజయ్య, శ్రీనివాస్, సురేందర్, పీఈటీలు ప్రణయ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలి

కరీంనగర్: జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలను పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పండిత, పీఈటీ పోస్టులను గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1కు మారుస్తామని తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. పదోన్నతులకు ముందే గ్రేడ్–1గా అవకాశం కల్పించాలని కోరారు. పదోన్నతుల సీనియారిటీ జాబితాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలను వేర్వేరుగా ఇవ్వాలని తెలిపారు. సీనియారిటీ లిస్టుల జాబితాలో అనేక తప్పులు దొర్లాయని అన్నారు. స్పెషల్ కేటగిరీ కింద ప్రాధ్యాస్ చేసిన మెడికల్ సర్టిఫికెట్లలో నకిలీవి ఉన్నట్లు తెలుస్తోందని, వాటిని పరిశీలించాలని తెలిపారు. పదోన్నతులను వెబ్ ద్వారా కాకుండా మాన్యువెల్ పద్ధతి ద్వారా నిర్వహించాలన్నారు. జీవో నం.317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సెకండరీ గ్రేడ్ టీచర్స్ భార్యభర్తల స్పౌస్ బదిలీలను చేపట్టి బ్లాక్ చేసిన 13 జిల్లాల్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, మహేశ్, వెంకటేశ్, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పీ గని సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గనిని శుక్రవారం నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎన్‌వీకే శ్రీనివాస్ సందర్శించి పనులు పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశంలో ఏర్పాటు చేసి ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. డైరెక్టర్ వెంట ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు సాంబయ్య, వెంకటేశ్వర్లులతో పాటు తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి గ్రామానికి చెందిన రైతు బద్దిపడిగె నారాయణరెడ్డి(64) ప్రమాదవశాత్తు వ్యవసాయ పొలంలో జారిపడి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నారాయణరెడ్డి గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. శుక్రవారం ఉదయం తన వ్యవసాయ భూమిలో నిర్జీవంగా పడి ఉన్నాడు. పొలం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒడ్డుపై నుంచి కాలు జారి పడి మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముత్యంరావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అర్హులైన వారందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

ఎనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పి మళ్లీ దానిని రూ.3లక్షలకు కుదించి ఇప్పటి వరకు జిల్లాలో ఒక్కరికి కూడా డబుల్‌బెడ్రూం ఇల్లు కానీ, ఇంటి స్థలం కాని ఇవ్వలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పేద ప్రజలను సమీకరించి గుడిసెలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, నాయకులు పాక మహేశ్, ఆరెపల్లి సురేశ్, చిలుముల రామ్మూర్తి, వీరగోని కిరణ్‌గౌడ్, మల్లేశ్, శారద, లక్ష్మి, రేణుక, అబ్బాస్, శీను, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్, వికెట్ తీసిన ఆనందంలో.., సీనియర్స్ విభాగంలో ఫైనల్ చేరిన వివేకానంద కళాశాల జట్టు

నేడు జూనియర్, సీనియర్ ఫైనల్ పోరు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్‌పీఎల్ సీజన్ 4 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో.. స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్ 4 నేటితో ముగియనుంది. కాగా.. శుక్రవారం మ్యాచ్‌ను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్‌లో క్రీడాకారులకు కొదువ లేదని.. టాలెంట్ ఉన్న వారు ఎందరో ఉన్నారని.. వారి ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఒక ప్లాట్ ఫాం అని పేర్కొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌లో వివేకానంద

సీనియర్స్ విభాగంలో ఉదయం రెండో సెమీఫైనల్ వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్.. ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్సారార్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. అనంతరం 76 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన వివేకానంద జట్టు కేవలం 6.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. నిఖిల్ 19 బంతుల్లో 2 సిక్స్‌లు, 5 ఫోర్లతో 36 పరుగులు చేయగా.. సాయినాథ్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 27 పరుగులు చేసి జట్టుకు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేశారు.

నేటి ఫైనల్ మ్యాచ్‌లు

జూనియర్స్ ఫైనల్: ఉదయం 9 గంటలకు జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్ వర్సెస్ ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల.

సీనియర్స్ ఫైనల్: మధ్యాహ్నం 12 గంటలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ వర్సెస్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల.